క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్వామి జయంతి



త్యాగరాజస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాల్కొండ హోల్ వీధిలో వెలసిన నెరవాటి బాలసుబ్బయ్య తోటలోని త్యాగరాజ స్వామి దేవస్థానంలో త్యాగరాజు స్వామి 258వ జయంతి, 178వ ఆరాధన మహోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక సుప్రభాతసేవ, అభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టణంలో పురవీధుల గుండా ఊంచావృత్తి (భిక్షాటన), గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం నాగస్వర విద్వాంసుడు రమేష్ బృందం సంగీత కచేరి అలంరించింది. సంగీత విద్వాంసులు రమణయ్య, కల్యాణి, ప్రసన్న సంగీత కచేరిని నిర్వహించారు. రామాయణం శ్రీనివాసులు, శివరామకృష్ణ, సురేష్‌బాబు, సాయిరాకేష్, సునిల్‌శర్మ, బాలకొండారెడ్డి, మోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం జరిపించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకీ చతుర్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఒడి బియ్యం, మెట్ల పూజ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేశారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామచంద్రారావు, వసుంధరదేవి, నాగేశ్వరరావు, అంబరేష్, ఈఓ లక్ష్మినారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యశాస్త్రి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సావిత్రి

దొర్నిపాడు: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. హాజరు శాతం ఆధారంగా జీతాలు మంజూరు అవుతయన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు



ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు మెట్ట వద్ద శుక్రవారం ఆటో, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రంగా,ఇద్దరికి స్వల్ప గాయలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల వైపు నుంచి రుద్రవరానికి ఆటో, రుద్రవరం నుంచి గాజులపల్లె వైపు మోటార్ సైకిల్‌పై సోఫియా,షుశేన్‌వలి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు, ఆటో డ్రైవర్ ప్రసాదు తీవ్రంగా గాయపడ్డారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ చిన్నబాబును పరామర్శిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బుధవారం విధుల్లో భాగంగా కానిస్టేబుల్ చిన్నబాబు నంద్యాలకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నబాబు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. చిన్నబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నామని, అండగా ఉంటామని భరోసానిచ్చామని చెప్పారు. త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు, ఎస్బీ సీఐ మోహన్‌రెడ్డి ఉన్నారు.

ముంచిన నకిలీ విత్తనాలు

- పాండురంగాపురం గ్రామంలో వందల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని వైనం
- భారీగా నష్టపోయిన అన్నదాతలు



ఎదుగుదల లేని మొక్కజొన్న కంకులను చూపుతున్న రైతులు

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో నకిలీ విత్తనాలతో అన్నదాతలు భారీగా నష్టపోయారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న విజయలక్ష్మి సీడ్స్ దుకాణంలో సీఎంహెచ్ 157 రకానికి చెందిన మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేశారు. ఈ రకం ధాన్యం వేసిన రైతుల పొలాల్లో పైరు ఏపుగా పెరిగినా కంకి పెరుగుదల ఆగిపోయింది. చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల పొలాల్లో వందలాది ఎకరాల్లో ఈ రకం మొక్కజొన్న విత్తనం సాగు అయ్యింది. కంకి ఎదుగుదల లేకపోవడంతో మోసపోయామని గ్రహించి సీడ్ కంపెనీ యజమాని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాలో పంట సాగుకు రూ.35వేలు ఖర్చు చేయగా కౌలు రూ.25వేలు కలిపి మొత్తం రూ.60వేల దాకా ఖర్చు అయ్యిందని రైతులు వంగా మోహన్‌రెడ్డి, కొల్లి శివారెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అరిగ సంజీవరెడ్డి, వై.వేణుగోపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, తదితరులు వాపోయారు. 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు రావాల్సి ఉండగా 10 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విజయలక్ష్మి సీడ్స్ నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తన ప్యాకెట్

మొలక శాతం తగ్గింది..

నాటిన నాల్గవ రోజుకే మొలక రావాల్సి ఉండగా ఈ రకం విత్తనం ఏడవ రోజుకు మొలక వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. మొలక శాతం తగ్గిందని అధికారులకు సూచించగా ఎకరాకు 10బస్తాల 28:28 అమ్మోనియా, 20:20:0:13 డీఏపీ, యూరియా, పొటాష్ నీళ్ల మందులు చల్లామన్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు గుంటూరు నుంచి తెచ్చిన మొక్కజొన్న సీడు విత్తన కంకి 10 నుంచి 12 అంగులాల వరకు సైజు వచ్చిందన్నారు. అయితే గ్రామంలో తాము సాగు చేసిన సీఎంహెచ్ 157 మొక్కజొన్న రకం కండే 2 అంగులాలు మాత్రమే వచ్చిందని పేర్కొంటున్నారు. సంబంధిత సీడ్ కంపెనీ యజమాని, వ్యవసాయాధికారులకు విషయాన్ని తెలియజేశామని, అలాగే.. ఇటీవల స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.



విత్తనాలను కొనుగోలు చేసిన బిల్లును చూపుతున్న రైతు సుబ్బారెడ్డి

సీడ్ కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేయాలి



నకిలీ మొక్కజొన్న విత్తనాలను అంటగట్టి ఆర్థికంగా తమను నష్టపరిచిన విజయలక్ష్మి సీడ్ కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేయాలి. సీడ్ కంపెనీ విత్తన అమ్మకాలను నిలిపివేయాలి. గతంలో విజయలక్ష్మి సీడ్ కంపెనీ నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు అప్పుల పాలయ్యారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సీడ్ కంపెనీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. **– తియ్యగూరు బసివిరెడ్డి, రైతు**

నష్టపరిహారం చెల్లించాలి



మొక్కజొన్న సాగుతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదును పంట సాగు చేసిన రైతులంతా చేయించుకున్నారు. ఎన్నో ఆశలతో పంట సాగు చేస్తే కంకి ఎదుగుదల లేక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. **– వెంకటరెడ్డి, రైతు**

అక్షరాలతో ఎన్‌టీఆర్ చిత్రం



ఎన్‌టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ 2,600 అక్షరాలతో ఎన్‌టీఆర్ చిత్రాన్ని గీచి అబ్బురపరిచారు. 3గంటల సమయంలో ఏ3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలనే నినాదంతో 2,600 అక్షరాలతో చిత్రాన్ని గీశారు. -నంద్యాల(అర్బన్)

శనగ పంట పరిశీలన



కాకరవాడలో శనగ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, డీఏఓ

ఉయ్యాలవాడ : మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన తరిగోపుల రఘునాథరెడ్డి, దండేలా రాజమహేంద్రారెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి సాగు చేసిన నంద్యాల 810 రకం పప్పుశనగ పంటను శుక్రవారం శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్సన్, నీలిమా, చైతన్య, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. పంటకు వైరస్ తెగుళ్ల సోకి జెజె-11, శ్వేత, విహారి, పూలేజీ రకాల శనగ పంట దెబ్బతినిందని రైతులు నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారు పంటను పరిశీలించి మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా రబీలో ఒకే పంట శనగ సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేస్తే తప్పా తెగుళ్ల నివారణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. అధిక వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో వేరు కుళ్లు, ఎండుతెగుళ్లు పంటను ఆశించాయన్నారు. ప్రతి సంవత్సరం రబీకి ముందు భూమిని ఖాళీగా ఉంచకుండా 60 లేదా 90 రోజులకు పంట దిగుబడులు వచ్చే కొర్ర, సజ్జ, జొన్న, చిరుధాన్యాల వంటి పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. వేసవిలో లోతు దుక్కులు, విత్తన సమయంలో ట్రైకోడర్మ విరిడితో విత్తన శుద్ధి చేస్తే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఏఈఓలు రాణెమ్మ, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య కోరారు. శుక్రవారం కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌కు వినతిపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ డీఎస్సీ 2025 ద్వారా భర్తీ చేసే పోస్టులలో బదిలీల వారీగా అవకాశం ఇవ్వాలన్నారు. 75మంది విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలకు ప్రదానోపాధ్యాయ పోస్టు మంజూరు చేస్తామని చెప్పడం శుభపరిణామన్నారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలంటే స్టేషన్, సరీస్ పాయింట్లు మాత్రమే ప్రతిపాదికగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్, మల్లేశ్వర్ పాల్గొన్నారు.



టెక్కె పురపాలక ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కెలో ఉన్న పురపాలక ఉన్నతపాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999– 2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, కుశల ప్రశ్నలతో సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. విందు భోజనం అనంతరం నాడు వారికి చదువుచెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు విజయబాస్కర్‌రెడ్డి, దస్తగిరి, సుబ్బయ్య, పద్మజ, పారెన్స్, పూర్వ విద్యార్థులు మున్నంగి రవి, ఇందిర కుమార్, మహేశ్వరి, దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రానికి గుర్తింపు తేవాలి

బొమ్మలసత్రం: పోలీసులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. పంజాబ్ రాష్ట్రంలో మార్చిలో జరగబోయే ఆలిండియా పోలీస్ మీట్-2025 పోటీలకు ఫెన్సింగ్ విభాగంలో పోటీ చేస్తున్న 12 మంది పోలీస్ సిబ్బంది శుక్రవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మార్చి 2 నుంచి 6 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ తరపున పోటీ పడుతున్న అభ్యర్థులకు 40 రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు లక్ష్మణ్‌ను కోచ్‌గా నియమించామన్నారు.



ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందితో ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన నాగరాజు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం ఆర్.కృష్ణాపురం , చక్రవర్తులపల్లె గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు (51) అనే రైతు మృత్యువాత పడ్డాడు. దువ్వూరు మండలం క్రిష్ణంపల్లె గ్రామానికి చెందిన నాగరాజు వేరుశనగ విత్తనాల కోసం మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. కొండంపల్లె గ్రామానికి చెందిన మణికంఠ తన మోటార్‌సైకిల్ పై చాగలమర్రికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చాగలమర్రి రోడ్డులోని ఆర్.కృష్ణాపురం, చక్రవర్తులపల్లె గ్రామాల మధ్య రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందినట్లు ఏఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మృతుడి కుమారుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ పేర్కొన్నారు.

బిజ్జెల నగేష్‌కు గౌరవ డాక్టరేట్

ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన అమ్మ సేవా సమితి వ్యవస్థాపకుడు, సమాజ సేవకుడు బిజ్జెల నగేష్‌కు అరుదైన పురస్కారం లభించింది. నగేష్ చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన సహారా చారిటబుల్ ట్రస్ట్ సంక్రాంతి రోజున హైదరాబాద్‌లో ట్రస్ట్ కార్యాలయంలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రణీత హాస్పిటల్‌లో ఆవోపా నాయకులు నగేషన్ సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రామసుబ్రహ్మణ్యం, ఆవోపా నాయకులు జనార్ధన్ ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ఆర్భాటం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అప్పులు దొరకవని, ఆదాయం పెంచుకోవాలని సూక్తులు చెబుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్వైడీ ప్రసాద్, నరసింహులు, సలాం, రవి, అబ్రహాం పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పని చేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏపీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తోటమద్దులు, బాలవెంకట్ మాట్లాడారు. మహేష్, చెన్నయ్య, గురుస్వామి పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే జీవితాల్లో వెలుగు



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి



పుస్తకాలను అందచేస్తున్న డీడీ

గోస్పాడు: అక్షరాస్యతతోనే మహిళల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఉమ్మడి జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్థానిక ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 26,785 మంది పొదుపు గ్రూపుల్లోని మహిళలు నిరక్ష్యరాస్యులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి చదువు నేర్పించేలా 2,678 మంది వలంటీర్ టీచర్లు స్వచ్ఛందగా పనిచేయనున్నట్లు తెలిపారు. టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ కోసం ఒక్కో సెంటర్‌కు రూ.400 ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరందరూ పొదుపు గ్రూపుల్లోని వారేనని, వలంటీర్లకు ఇప్పటికే రెండో విడత శిక్షణను కూడా పూర్తిచేసినట్లు చెప్పారు. పొదుపు గ్రూపుల్లోని మహిళలు అక్ష్యరాస్యులుగా మారేందుకు ఈ కార్యక్రమం ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. డిజిటల్, ఫైనాన్సియల్ లిట్రసీ తెలుసుకునేందుకు ఎంతైనా అవసరమన్నారు. పొదుపు గ్రూపులలో జరిపే లావాదేవీలు తెలుసుకొనేందుకు ఫైనాన్స్ లిట్రసీ, బ్యాంకుల నుంచి లావాదేవీలు చెల్లించే సమయంలో వారి ఫోన్లకు వచ్చే మెసేజ్‌లతో పాటు ఇతర లావాదేవీలకు సంబంధించిన వాటిని మోసపోకుండా తెలుసుకునేందుకు డిజిటల్ లిట్రసీ ఎంతోగానో అవసరమన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టీసీఎస్ కంపెనీ సహకారంతో సెల్ ద్వారా వీడియో లింకులను వలంటీర్ టీచర్లకు పంపి పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు. అవకాశాన్ని నిరక్ష్యరాస్య మహిళలు సద్వినియోగంచేసుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీరమాదేవి, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

వందశాతం అక్ష్యరాస్యతను సాధిద్దాం

శిరివెళ్ల: వందశాతం అక్ష్యరాస్యతను సాధిద్దామని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం స్వచ్ఛం వలంటీర్లకు శిక్షణ తరగతులు జరిగాయి. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం కింద 15 – 50 ఏళ్ల మధ్య వయస్సు గల నిరక్ష్యరాసులను అక్ష్యరాస్యులుగా మార్చాలనేది లక్ష్యమన్నారు. జిల్లాలో మొదటి దశలో 26,785 మందికి చదువు చెప్పడానికి 2,679 మంది స్వచ్ఛంద వలంటీర్లను ఎంపిక చేశామన్నారు. వారు తమ పరిధిలోని 10 మందికి సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు అనుకూలమైన ప్రదేశాల్లో తరగతులు నిర్వహిస్తారన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది పర్యవేక్షణలో ఈ నెల 23వ తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మార్చి వరకు చదువు చెప్పి వారికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండలంలో 1,120 మందికి 25 మంది వలంటీర్లు చదువు చెబుతారన్నారు. ఏ,బీ, గ్రేడ్ వారికి 10వ తరగతి పరీక్షలు రాయడానికి అర్హులవుతారన్నారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ

శిరివెళ్ల: ఉపాధి పథకం సామాజిక తనిఖీలా కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలుపై సామాజిక తనిఖీ జరుగుతుందని ఎస్సార్పీ కాంతయ్య తెలిపారు. శుక్రవారం సామాజిక తనిఖీ డీఆర్పీలు, గ్రామ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 19వ తేదీ నుంచి క్షేత్ర స్థాయిలో మొదలవుతుందన్నారు. అందుకు గాను ఏడుగురు డీఆర్పీలు, 16 మంది గ్రామ కార్యకర్తలను నియమించామన్నారు. 2023-24లో మండలంలో రూ. 10 కోట్లతో వివిధ పనులు జరిగాయన్నారు. అందులో రూ. 2 కోట్ల పంచాయితీ రాజ్, రూ. 50 లక్షలతో పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టారన్నారు.

23న ఎరుకలస్వామి ఆరాధన

దొర్నిపాడు: స్థానిక కోట ఆవరణలో ఉన్న అవధూత శ్రీ ఆది అల్లూరి ఎరుకలి స్వామి ఆరాధనోత్సవాన్ని ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు బాలిరెడ్డి, సిద్ది సత్యనారాయణ, అక్కల శివయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం గోపూజ, ప్రాతఃకాల పూజ, అభిషేకం అనంతరం భగవద్గీత పారాయణం, మహా మంగళహారతి, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం ప్రియవర్ధిని కూచిపూడి నాట్యం, రాత్రి భక్తజన చింతామణి పూర్తి నాటకం ఉంటుందని చెప్పారు.

పారా స్పోర్ట్స్ సంఘం ఆవిర్భావం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు పొందిన ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధంగా నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం (దివ్యాంగుల క్రీడా సంఘం)ను శుక్రవారం ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. అధ్యక్షుడిగా రవికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రమణయ్య, ఉపాధ్యక్షుడిగా బాబాఫకృద్దీన్, సంయుక్త కార్యదర్శిగా మధుకుమార్, కోశాధికారిగా మధు, కార్యవర్గ సభ్యులుగా వెంకటరావు, కోనేటి కల్యాణి, వీరభరతుడుతో కార్యవర్గం ఎంపిక చేసి కమిటీని ఎన్నుకున్నారు.

స్వర్ణకారుల సంక్షేమమే ధ్యేయం



చాగలమర్రిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కర్రి వేణుమాధవ్

చాగలమర్రి: నిరుపేద స్వర్ణకారుల సంక్షేమానికి కృషి చేస్తామని స్వర్ణకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక చిన్నమకానం వీధిలో ఉన్న చక్రం కాంప్లెక్స్‌లో సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం మండల అధ్యక్షుడిగా డి.గౌస్‌బాషా, ఉపాధ్యక్షుడు హాజీ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, కోశాధికారి సాదిక్‌వలి, అధికార ప్రతినిధి కె అబ్దుల్లా, వర్కింగ్ అధ్యక్షులు ముల్లా దాదాపీర్, సభ్యులు 29 మందితో ప్రమాణాస్వీకారం చేయించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలిమ్, ఉస్మాన్, కర్నూల్ జిల్లా అధ్యక్షుడు షాషా తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో ఇంటికి వెలుగు

ఉయ్యాలవాడ : అక్షరాస్యతతో ప్రతి కుటుంబంలో వెలుగునిండుతుందని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు గ్రూపు సభ్యులతో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు పొదుపు గ్రూపుల్లో వున్న ప్రతి మహిళకు చదువు నేర్పించవలసిన బాధ్యత గ్రూపు లీడర్లపక్షుందన్నారు. వెలుగు సీసీ గంగన్న పాల్గొన్నారు.

హాస్టల్ వాచ్‌మెన్‌పై దాడి

ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎస్సీ హాస్టల్ వాచ్‌మెన్ లాజర్‌పై తాగుబోతులు దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సీ బాలుర హాస్టల్ ప్రహరీలో కొందరు తాగుబోతులు మద్యం సేవిస్తుండగా వాచ్‌మెన్ లాజర్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో ఆగ్రహించిన వారు దాడి చేయడంతో గాయపడిన లాజర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ నగీన తెలిపారు.

విజయవంతం చేయండి

రుద్రవరం: ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించిందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు .స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె తెలిపిన వివరాల మేరకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు విషయాన్ని తెలియజేయాలని చెప్పామన్నారు. ఆ రోజు పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలు,బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని చెప్పారు.

మహిళపై కొడవలితో దాడి

శిరివెళ్ల: వెంకటాపురం గ్రామానికి చెందిన నాగ అంజలిపై బాబా ఫకృద్దీన్ కొడవలితో దాడి చేశారని ఎస్ఐ చిన్న పీరయ్య శుక్రవారం తెలిపారు. మహిళ కొంత కాలంగా గోస్పాడు మండలం ఒంటెలగల బాబా ఫకృద్దీన్‌తో కలిసి నంద్యాలలో కాపురం ఉంటోంది. వారికి పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఇటీవల వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింటికి వచ్చింది. ఈ నెల 16న రాత్రి వ్యక్తి ఇంటికి వచ్చి ఇంటికి రావాలని బాబా పిలవడంతో ఇద్దరిమధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కోపంతో అంజలిపై కొడవలితో దాడి చేయడంతో గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.